# బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 07 ఆగస్టు 2024 | www.balagamtv.com | పేజీలు 4


## నేడు జాతీయ చేనేత దినోత్సవం

- సిరిసిల్ల లో ర్యాలీ, కార్యక్రమాలు
- హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ ఏడీ సాగర్...



బలగం టీవీ ,సిరిసిల్ల

జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ ఎడి సాగర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ సాగర్ మాట్లాడుతూ సిరిసిల్ల లోని బీవై నగర్లోని హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ కార్యాలయం నుంచి సిరిసిల్ల పాత బస్ స్టాండ్ నేతన్న చౌక్ దాకా ర్యాలీ తీసి,అనంతరం బీవై నగర్లోని షాది ఖానాలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా ముఖ్య అతిథులను ఆహ్వానించి, అందరితో కలిసి ప్రతిజ్ఞ చేయనున్నట్లు పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు .

## 15న మూడో విడత రుణమాఫీ




- సుమారు 6వేల మందికి రూ.6 వేల కోట్లు..
- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

: ఈ నెల 15న మూడో విడత రుణమాఫీ చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. స్వాతంత్ర్య వేడుకల రోజున వైరాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.2 లక్షల వరకు రుణమాఫీని ప్రారంభిస్తారని చెప్పారు. ఖమ్మం జిల్లాకు గోదావరి జలాల విడుదల కార్యక్రమానికి సంబంధించిన సభలోనే రుణమాఫీ ప్రారంభిస్తారని మంత్రి వెల్లడించారు. మూడో విడతలో సుమారు 6 వేల మంది రైతులకు, దాదాపు రూ.6 వేల కోట్ల రుణాలు మాఫీ కానున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే సాంకేతిక కారణాల వల్ల రెండు విడతల్లో 30 వేల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని, పొరపాట్లన్నీ సరి చేసి అర్హులందరికీ రుణమాఫీ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. రుణమాఫీపై ఆరోపణలు, అనుమానాలు, అసత్య ప్రచారం చేయడం సరికాదని అన్నారు. రుణమాఫీపై రాజకీయ విమర్శలు దురదృష్టకరమన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రైతాంగాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయ లబ్ధి పొందలేరని వ్యాఖ్యానించారు. ప్రక్రియ పూర్తి కాకముందే విమర్శలు చేయవద్దన్న ఆయన, రుణమాఫీకి ప్రతిపక్షాలు అడ్డంకులు సృష్టించి రైతుల మనోభావాలను దెబ్బ తీయవద్దని హితవు పలికారు.

రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ చేస్తోందని తెలిపారు. ఎన్ని కష్టాలు ఉన్నా రుణమాఫీ చేస్తున్నామని చెప్పారు. రుణమాఫీ విషయంలో ప్రతిపక్ష నేతలు అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. గత ఐదేళ్లలో రైతులు తీసుకున్న రుణాలు మాఫీ చేస్తున్నామని వెల్లడించారు. రైతులను రుణాల నుంచి విముక్తి చేస్తామని హామీ ఇచ్చారు. పాస్‌బుక్ లేకపోయినా, తెల్లకార్డు ద్వారా రుణాలు మాఫీ చేస్తున్నట్లు వెల్లడించారు. మాఫీ కాకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సాంకేతిక కారణాల వల్ల కొన్ని రుణాలు మాఫీ కాలేదని, వాటిని పరిష్కరించి రుణమాఫీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.గత ఐదు సంవత్సరాలుగా తీసుకున్న రైతు రుణాలకు సంబంధించి ఖాతాల వివరాలు 32 బ్యాంక్?లు పంపించాయి. ఇప్పటివరకు రూ.లక్షన్నర వరకు రుణమాఫీ వర్తింపజేశాం. మేము చెప్పినట్లుగా పూర్తిగా రైతు మాఫీ చేసి తీరుతాం.' అని అన్నారు.

# అమెరికాలో సీఎం రేవంత్ బిజీబిజీ



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా అమెరికాలో పర్యటిస్తున్న సీఎం రేవంత్ బృందం బిజీబిజీగా గడుపుతోంది. పలు కంపెనీల ప్రతినిధిలతో భేటీ అవుతూ ఒప్పందాలు చేసుకుంటున్నాయి. సోమవారం కాగ్నిజెంట్ సంస్థతో ఒప్పందం చేసుకున్న రేవంత్ బృందం తాజాగా మరికొన్ని సంస్థలతో అవగాహన కుదుర్చుకున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం మంగళవారం రెండో రోజు పలువురు పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిపింది. ట్రైజిన్ టెక్నాలజీస్ కంపెనీ ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్నోవేషన్ అండ్ డెలివరీ సెంటర్ నెలకొల్పేందుకు ట్రైజిన్ టెక్నాలజీస్ సంసిద్ధత వ్యక్తం చేసింది.

ఆరు నెలల్లో కంపెనీ కార్యకలాపాలు ప్రారంభించి, రెండేళ్లలో వెయ్యి మందికి పైగా ఉద్యోగాలు కల్పించ నున్నట్లు ట్రైజిన్ టెక్నాలజీస్ యాజమాన్యం తెలిపింది. డేటా అనలిటిక్స్, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్‌లకు అవసరమయ్యే ఇంటెలిజెన్స్ సొల్యూషన్స్?ను ఈ కంపెనీ అందిస్తుంది. సుమారు 160 మిలియన్ డాలర్ల వార్షికాదాయం ఉన్న ట్రైజిన్ టెక్నాలజీస్‌లో ఇప్పటికే హైదరాబాద్‌లో ఉన్న కంపెనీలోని వంద మందితో పాటు ప్రపంచవ్యాప్తంగా సుమారు 2500 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.

హైదరాబాద్‌లో డేటా మేనేజ్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు ఆర్సీఎం కంపెనీ ఒప్పందం చేసుకుంది. న్యూయార్క్‌లో సీఎం రేవంత్ రెడ్డి బృందంతో ఆర్సీఎం సీఈవో గౌరవ్ సూరి సమావేశమయ్యారు. అమెరికా వెలుపల తొలిసారిగా హైదరాబాద్‌లో కంపెనీ ఏర్పాటు చేయబోతున్నట్లు ఆర్సీఎం యాజమాన్యం ప్రకటించింది. రానున్న రెండేళ్లలో 500 మంది సాంకేతిక నిపుణులను నియమించనున్నట్లు తెలిపింది. ఐటీ రంగంలో బహుముఖ వృద్ధిని సాధించేందుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యమి స్తోందని ముఖ్యమంత్రి

మిగితా 2వ పేజీలో

# ఐటీ ఉద్యోగాల క్షీణితపై కేటీఆర్ ఆందోళన



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ఐటి ఎగుమతులు, ఉద్యోగాలు క్షీణించటంపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ శాఖ మంత్రి కెటిఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఐటి ఎగుమతులు, ఉద్యోగాల్లో క్షీణతకు సంబంధించిన గణంకాలను ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. 2022 -23 సంవత్సరంలో తెలంగాణ నుంచి 57,706 కోట్ల ఐటి ఎగుమతులు ఉంటే 2023 -24 కాలానికి 26,948 కోట్ల ఎగుమతులే జరిగాయని పేర్కొన్నారు. ఐటీ ఎంప్లాయిమెంట్ కల్పన కూడా భారీగా పడిపోయిందని, 2022 -23 కాలంలో 1,27,594 కొత్త ఉద్యోగాలు వస్తే 2023 -24లో కేవలం 40,285 ఉద్యోగాలు మాత్రమే కల్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఆరేడేళ్లలో తెలంగాణలో ఐటి ప్రగతి గణనీయంగా పెరిగేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. సింగిల్ విండో విధానం, టిఎస్ ఐపాస్, ఐటి రంగానికి సంబంధించి ప్రభుత్వ పాలసీల కారణంగా అత్యంత వేగంగా హైదరాబాద్‌లో ఐటి రంగం అభివృద్ధి చెందిందని అన్నారు. హైదరాబాద్‌ను దేశానికి ఐటి కేంద్రంగా చేసేందుకు ఎంతో కృషి చేశామని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐటి రంగాన్ని పూర్తిగా విస్మరిస్తుందని కెటిఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఆర్థిక ప్రగతికి ఐటి రంగం పురోగతి ఎంతో మేలు చేసిందని గుర్తు చేశారు. ఐటి రంగాన్ని పట్టించుకోకపోతే రాష్ట్రం ఆర్థికంగా, ఉపాధి కల్పన పరంగా నష్టపోయే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఐటితో పాటు ఐటిఇఎస్ రంగాలకు ప్రాముఖ్యత ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మళ్లీ నగరంలో ఐటి రంగం పుంజుకోవాలంటే ప్రభుత్వం ప్రత్యేకంగా దీనిపై ఫోకస్ పెట్టాలని కోరారు. ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలకు, స్టార్టప్ కంపెనీలకు అన్ని విధాలుగా మద్దతు ఇవ్వాలని ఐటి రంగానికి ఉపయోగపడే విధానాలు తేవాలని పేర్కొన్నారు. ఐటి సంస్థలు మరిన్ని పెరగాలంటే ఎప్పటికప్పుడు మౌలిక సదుపాయాలను పెంచుతూనే లా అండ్ ఆర్డర్‌ను కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఐటి ఎగుమతులు, ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వం నిరంతరం దృష్టి పెట్టాలని కెటిఆర్ తెలిపారు.

## బంగ్లాదేశ్‌లో పరిస్థితులను గమనిస్తున్నాం




- కేంద్ర మంత్రి జైశంకర్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

బంగ్లాదేశ్‌లో జరుగుతున్నరాజకీయ అస్థిర పరిస్థితులను కేంద్రం నిశితంగా గమనిస్తోందని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ వెల్లడించారు. ఈ మేరకు బంగ్లాదేశ్ పరిణామాలపై రాజ్యసభలో ఆయన ప్రకటన చేశారు. బంగ్లాలో మైనార్టీల వ్యాపారాలపై దాడులు జరుగుతున్నాయని నశ్రీవస్త్రశ్రీనెఆ. అక్కడ ఉన్న భారతీయ విద్యార్థులు జులైలోనే స్వదేశానికి వచ్చేశారని చెప్పారు. ఢాకాలోని అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదించి అన్ని వివరాలు అడిగి తెలుసుకుంటున్నామని తెలిపారు."రాయబారమార్గాల ద్వారా బంగ్లాదేశ్‌లోని భారతీయసమాజంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూనే ఉన్నాం. 9వేల మంది విద్యార్థులుసహా మొత్తం 19వేల మంది భారతీయులు అక్కడ ఉన్నారు. హైకమిషనర్ సూచన మేరకు చాలామంది విద్యార్థులు జులైలోనే స్వదేశానికి తిరిగివచ్చారు. ఢాకాలోని హైకమిషన్ తోపాటు చిట్టగాంగ్, రాజ్‌షాహీ, కుల్నార్, సిల్హేర్‌లో అసిస్టెంట్ హైకమిషన్‌లు ఉన్నాయి. వాటికి అక్కడి ప్రభుత్వం తగినంత భద్రత కల్పిస్తుందని ఆశిస్తున్నాం. మైనార్టీల పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం." అని జై శంకర్ వెల్లడించారు.

బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిస్థితులు భారత టెక్స్‌టైల్ రంగాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయని ఇండియన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ కాన్ఫెడరేషన్ మంగళవారం తెలిపింది. ముఖ్యంగా ఆ దేశంలో ఫ్యాక్టరీలను నిర్వహిస్తున్న కంపెనీలకు ఇబ్బందిగా మారిందని చెప్పింది. బంగ్లాదేశ్‌లో సప్లైకు ఇబ్బంది ఏర్పడితే భారత్‌లో సప్లై చైన్‌పై ప్రభావం పడుతుందని వెల్లడించింది. తద్వారా భారతీయ సంస్థల ప్రొడక్షన్ షెడ్యూల్‌లు, డెలివరీ టైమ్‌లైన్‌లను ప్రభావితం చేసే అవకాశం ఉందని తెలిపింది.

# బంగ్లాదేశ్ పార్లమెంట్ రద్దు..



బలగం టీవి, ఢాకా

ప్రధాని షేక్ హసీనా రాజీనామా అనంతరం బంగ్లాదేశ్‌లో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఆ దేశ అధ్యక్షుడు మహ్మద్ షహబుద్దీన్ ఈ ఏడాది జనవరి 7న ఏర్పాటైన షేక్ హసీనా ఏర్పాటు చేసిన ప్రభుత్వాన్ని రద్దు చేశారు. త్రివిధ దళాల అధిపతులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పౌర సమాజ ప్రతినిధులు, విపక్ష వ్యతిరేక ఉద్యమ నేతలతో బంగ్లాదేశ్ అధ్యక్షుడు చర్చలు జరిపారు. అనంతరం పార్లమెంట్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు అధ్యక్షుడి కార్యాలయంలో ఓ ప్రకటనలో పేర్కొంది. మరో వైపు బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు కానున్నది. ఈ ప్రభుత్వానికి నోబెల్ శాంతి పురస్కారం గ్రహీత మహ్మద్ యూనస్ సారథ్యం వహించనున్నారు. ఇందుకు ఆయన అంగీకరించినట్లుగా పలు మీడియా సంస్థలు తెలిపాయి. 84 సంవత్సరాల ఆర్థిక వేత్త విద్యార్థి నేతల అభ్యర్థన మేరకు ఆయన తాత్కాలిక ప్రభుత్వానికి అధిపతిగా కొనసాగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు పేర్కొన్నాయి.

మరో వైపు బంగ్లదేశ్ మాజీ ప్రధాని, కీలక ప్రతిపక్ష నేత ఖలీదా జియా జైలు నుంచి విడుదలయ్యారు. ప్రధానిగా షేక్ హసీనా రాజీనామా అనంతరం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఆమెను జైలు నుంచి విడుదల చేయాలని ప్రెసిడెంట్ షహబుద్దీన్ ఆదేశించారు. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (%దీచ్రీ%) చైర్‌పర్సన్ బేగం ఖలీదా జియాను తక్షణమే విడుదల చేయాలని సమావేశం నిర్ణయించారు. ఈ క్రమంలో అధ్యక్షుడి ఆదేశాల జారీ చేసిన కొద్దిగంటల్లోనే ఆమె విడుదలయ్యారు. మాజీ ప్రధాని 2018లో అవినీతి కేసులో అరెస్టయ్యారు. గతకొంతకాలంగా ఆమె ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. 2.50లక్షల డాలర్ల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆమెపై అభియోగాలను మోపారు. అవినీతి ఆరోపణలను బీఎన్‌పీ ఖండించింది.

మిగితా 2వ పేజీలో



## ఎస్బీఐ చైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు

బలగం టీవి, న్యూఢిల్లీ

కేంద్ర ప్రభుత్వ రంగ వాణిజ్య బ్యాంకు భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) చైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు శెట్టి (సీఎస్ శెట్టి) మంగళవారం నియమితులు అయ్యారు. ఆయన ఈ పదవిలో మూడేండ్ల పాటు ఉంటారు. ప్రస్తుతం బ్యాంకులో అత్యంత సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న సీఎస్ శెట్టి.. ఈ నెల 28న రిటైర్ కానున్న ఎస్బీఐ చైర్మన్ దినేశ్ కుమార్ ఖరా స్థానంలో నియమితులయ్యారు.కేంద్ర ఆర్థిక విభాగం ప్రతిపాదనకు కేంద్ర నియామకాల కమిటీ (ఏసీసీ) ఆమోదం తెలిపింది. ఎస్బీఐ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి చల్లా శ్రీనివాసులు శెట్టి మూడేండ్ల పాటు పదవిలో కొనసాగుతారు. ఎస్బీఐ చైర్మన్‌గా నియమితులయ్యే వారు 63 ఏండ్ల వయస్సు వచ్చే వరకూ కొనసాగుతారు. ఎస్బీఐ చైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు శెట్టితోపాటు బ్యాంకు ఎండీగా రాణా అశుతోష్ కమార్ సింగ్‌ను కేంద్రం నియమించింది. ప్రస్తుతం రాణా అశుతోశ్ కుమార్ సింగ్ బ్యాంక్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఎస్బీఐ చైర్మన్‌కు నలుగురు మేనేజింగ్ డైరెక్టర్లు సహకరిస్తారు.

కేంద్ర ప్రభుత్వం నియమించిన పలు టాస్క్ ఫోర్స్ లు, కమిటీలకు చల్లా శ్రీనివాసులు శెట్టి సారథ్యం వహించారు. ఎస్బీఐలో ఆయన రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్ పోర్ట్ ఫోలియో వ్యవహారాలను పర్యవేక్షించారు. ఏజీ బీఎస్ పూర్తి చేసిన చల్లా శ్రీనివాసులు శెట్టి.. ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకర్స్ నుంచి సర్టిఫైడ్ అసోసియేట్ పట్టా అందుకున్నారు. 1988లో ఎస్బీఐలో ప్రొబేషనరీ అధికారిగా కెరీర్ ప్రారంభించారు. బ్యాంకులో ఆయనకు కార్పొరేట్ క్రెడిట్, రిటైల్, డిజిటల్, ఇంటర్నేషనల్ బ్యాంకింగ్, సంపన్న దేశాల్లో బ్యాంకింగ్ లో కీలక బాధ్యతలు నిర్వహించిన అనుభవం కలిగి ఉన్నారు.

## గోదావరి ఫేజ్-2 పనులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్



- జీఓ జారీ చేసిన పురపాలకశాఖ
- ముఖ్య కార్యదర్శి దాన కిశోర్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలను మరింత మెరుగుపరిచేందుకు గోదావరి తాగునీటి సరఫరా ఫేజ్-2కు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. గోదావరి రెండో దశ పనులకు ప్రభుత్వం రూ.5560 కోట్లు కేటాయించింది.

ఇదిలా ఉండగా ఈ పథకం ద్వారా నగరానికి అదనపు నీటిని తరలించడంతో పాటు హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ రిజర్వాయర్లు పునరుద్ధరణ కానున్నాయి. హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో ఈ పనులు పూర్తి చేస్తారు. ప్రస్తుతం హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం అన్ని వనరుల నుంచి 580 ఎంజీడీల నుంచి 600 ఎంజీడీల వరకు నీరు సరఫరా అవుతోంది.అయితే 2030 నాటికి నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనంగా 170 ఎంజీడీల నీటిని సరఫరా చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గోదావరి నది

మిగితా 2వ పేజీలో

# అమెరికాలో సీఎం రేవంత్ బిజీబిజీ

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి కంపెనీ ప్రతినిధులకు స్పష్టం చేశారు. ఆర్సీసీఎం కంపెనీ ఏర్పాటుతో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ రంగంలో హైదరాబాద్ కొత్త ఆవిష్కరణ కేంద్రంగా నిలబెడుతుందని సీఎం అన్నారు. తెలంగాణలో వెయ్యి కోట్ల రూపాయలతో బయో ఇథనాల్ తయారీ సంస్థ ఏర్పాటు చేసేందుకు స్వచ్ఛ్ బయో కంపెనీ ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో స్వచ్ఛ్ బయో కంపెనీ సీఈవో ప్రవీణ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో సుమారు 500 మందికి ఉద్యోగాలు కల్పించేలా రోజుకు 250 కిలో లీటర్ల సామర్థ్యంతో రెండో తరం బయో ఇంధన ప్లాంటు నెలకొల్పనున్నట్లు ఆ కంపెనీ యాజమాన్యం వెల్లడించింది.







## హైదరాబాద్‌లో ట్రైజిన్ ఏఐ ఇన్నోవేషన్ సెంటర్

### ఆరు నెలల్లో కార్యకలాపాల ప్రారంభం..

### వెయ్యి మందికిపైగా ఉద్యోగాలు, శిక్షణ

ట్రైజిన్ టెక్నాలజీస్ కంపెనీ హైదరాబాద్ లో తమ అర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సెంటర్ నెలకొల్పనుంది. అమెరికా పర్యటనలో ఉన్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని అధికారుల బృందంతో కంపెనీ ప్రతినిధులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే సెంటర్ పై ఈ సందర్భంగా చర్చలు జరిపారు. ట్రైజిన్‌కంపెనీ డేటా అనలిటిక్స్, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్‌లకు అవసరమయ్యే ఇంటెలిజెన్స్ సొల్యూషన్స్ అందిస్తుంది. హైదరాబాద్ లో ట్రైజిన్ కంపెనీ అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్నోవేషన్ అండ్ డెలివరీ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. రాబోయే మూడేండ్లలో 1,000 మందికి పైగా ఉద్యోగులను నియమించుకొని శిక్షణను అందిస్తుంది.

ట్రైజిన్ కంపెనీ మొత్తం ఆదాయం 160 మిలియన్ డాలర్లకు పైగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ కంపెనీలో పని చేస్తున్న 2,500 మందిలో వెయ్యి మంది మన దేశంలో ఉండగా, ప్రస్తుతం హైదరాబాద్‌లో దాదాపు వంద మంది ఉన్నారు. మరో ఆరు నెలల్లోనే తమ కార్యకలాపాలను ప్రారంభించనున్నట్లు ఈ కంపెనీ ప్రకటించింది.

రెండు దశాబ్దాలకు పైగా ఐక్య రాజ్య సమితితో పాటు అనుబంధ విభాగాలకు ట్రైజిన్ కంపెనీ సాంకేతిక భాగస్వామిగా వ్యవహరి స్తోంది. గత ఏడాది నుంచి ట్రైజిన్ కంపెనీ తమ సేవలను అందుకుం టున్న సంస్థల్లో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంతో పాటు ఫలితాలపై విశ్లేషణలు చేస్తోంది. అన్ని

## ఆర్సీజియం విస్తరణకు ఒప్పందం

తెలంగాణకు పెట్టుబడులే లక్ష్యంగా అమెరికాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం మరో కంపెనీతో అవగాహన కుదుర్చుకుంది. అసెట్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ సర్వీసెస్, అడ్వాన్స్‌డ్ డేటా ఆపరేషన్స్‌లో ప్రముఖ కంపెనీ ఆర్సీజియం హైదరాబాద్‌లోని తమ కంపెనీని విస్తరించడానికి అంగీకరించింది. ఆర్సీజియం సీఈఓ గౌరవ్ సూరి గారు, ఇతర ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర అధికారుల బృందం జరిపిన చర్చల్లో ఈ మేరకు ఒప్పందం కుదిరింది.

ఆర్సీజియంఅంతర్జాతీయంగా బయటి దేశాల్లో మొదటి శాఖను హైదరాబాద్‌లోనే ఏర్పాటు చేసింది. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి అందిస్తున్న సహకారంతో తమ సేవలను మరింతగా విస్తరిస్తున్నట్టు కంపెనీ ప్రకటించింది. అంతర్జాతీయ స్థాయిలో కావలసిన సదుపాయాలకు అనుగుణంగా హైదరాబాద్‌లోని గొప్ప టాలెంట్ ఫోర్స్, సహజ రీతిలో ఉండే లొకేషన్, నైపుణ్యం కలిగిన స్థానిక ఉద్యోగుల లభ్యత కారణంగా అంకితభావంతో హైదరాబా ద్‌లో డాటా సొల్యూషన్ సర్వీసులను అభివృద్ధి పరుస్తున్నామని గౌరవ్ సూరి తెలిపారు.

వచ్చే రెండేళ్లలో హైదరాబాద్‌లో 500 మంది అత్యాధునిక సాంకేతిక నిపుణులను కంపెనీ నియమించుకోనుంది. డీఈ షా గ్రూప్ , బ్లాక్‌స్టోన్ ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ మద్దతుతో ఆర్సీజియం స్వతంత్ర సంస్థగా ప్రారంభమైంది.

ఆర్సీజియం తన సేవలను విస్తరణ చేపడుతున్నందుకు ముఖ్యమంత్రి కంపెనీ ప్రతినిధులను అభినందించారు. కంపెనీకి తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. తెలంగాణలో ఐటీ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు.

## తెలంగాణలో 2జీ బయో ఇథనాల్ ప్లాంట్

### స్వచ్ఛ్ బయో రూ.1000 కోట్ల పెట్టుబడి..

### 500 మందికి ఉద్యోగాలు

బయో ఫ్యూయల్స్ తయారీ సంస్థ స్వచ్ఛ్ బయో తెలంగాణలో పెట్టుబడులకు సిద్ధపడింది. త్వరలోనే తెలంగాణలో సెకండ్ జనరేషన్ సెల్యులోసిక్ బయో ఫ్యూయల్ ప్లాంట్ నెలకొల్పనుంది. మొదటి దశలో దాదాపు రూ.వెయ్యి కోట్ల పెట్టుబడితో ఈ ప్లాంట్ నిర్మించనుంది. ఈ ప్లాంట్ ఏర్పాటులో 250 మందికి ప్రత్యక్షంగా, 250 మందికి పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి.

అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు తెలంగాణ అధికార ప్రతినిధి బృందంతో స్వచ్ఛ్ బయో ఛైర్ పర్సన్ ప్రవీణ్ పరిపాటి చర్చలు జరిపారు. స్వచ్ఛ బయోతో అంతర్జాతీయ భాగస్వామిగా ఉన్న సుగనిత్ బయో రెన్యువబుల్స్ కంపెనీ బయోమాస్, సెల్యులోజ్ నుండి జీవ ఇంధనాలు మరియు జీవ రసాయనాలను ఉత్పత్తి చేసే పేటెంట్ పొందటంతో పాటు అవసరమైన సాంకేతికతను అభివద్ధి చేసింది.

ఈ కంపెనీ పెట్టుబడులు రాష్ట్రంలో సుస్థిరమైన, పర్యావరణ అనుకూలమైన వృద్ధికి దోహదపడనుంది. అందుకే పెట్టుబడులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం ఎంచుకున్న తెలంగాణ వికేంద్రీకృత అభివృద్ధి దృక్పథం తమను ఆకట్టుకుందని కంపెనీ ఛైర్మన్ ప్రవీణ్ పరిపాటి అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకోవటం తమకు ఆనందంగా ఉందన్నారు. రాబోయే కాలంలో మరిన్నిప్లాంట్లు ఏర్పాటు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని బయో ఫ్యూయల్స్ హబ్‌గా మార్చాలనే తమ ఆలోచనలను అధికారులతో పంచుకున్నారు.

## హైదరాబాద్ 4.0 ఫ్యూచర్ సిటీ

# ఇండియాకు కొత్త చిరునామా



- తెలంగాణ అంటేనే పెట్టుబడుల గమ్యస్థానం.. వ్యాపారాలకు సులభంగా కొత్త పారిశ్రామిక విధానం
- అమెరికాలో రౌండ్ టేబుల్ సమావేశంలో పారిశ్రామికవేత్తలతో సీఎం రేవంత్ రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలు న్నాయని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పరిశ్రమల అవసరాలు, అభిరుచికి అనుగుణంగా తమ ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొం దిస్తుందని ప్రకటించారు. అమెరికాలో ఉన్న వ్యాపార అవకాశాలన్నీ తెలంగాణలో ఉన్నాయని, చైనాకు ప్రత్యామ్నాయంగా ఎదగాలనేది తమ సంకల్పమని అన్నారు. తెలంగాణ అంటేనే వ్యాపారం.. తెలంగాణ అంటేనే పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుస్తామని చెప్పారు. రాష్ట్రంలో చేపట్టిన ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులను ఈ సందర్భంగా సీఎం వివరించారు.

త్వరలోనే హైదరాబాద్లో నాలుగో నగరంగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు. ఇది భారత దేశపు భవిష్యత్తుకు చిరునామాగా నిలుస్తుందని అభిప్రాయ పడ్డారు. దేశంలోనే జీరో కార్బన్ సిటీ ఇక్కడ ఏర్పడతుందని అన్నారు. ఫ్యూచర్ సిటీలో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్తో పాటు, మెడికల్, టూరిజం, స్పోర్ట్స్, సాఫ్ట్‌వేర్, ఫార్మా విలేజ్లను అభివృద్ధి చేస్తామన్నారు.

ఈ ఫ్యూచర్ సిటీ రాష్ట్ర అభివృద్ధితో పాటు పరిశ్రమలకు సిరుల పంట పండిస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో వ్యాపారాలు, పెట్టుబడుల విస్తరణను సులభతరం చేస్తామని సీఎం ప్రకటించారు. అటువంటి సరికొత్త ఆలోచనలతోనే కొత్త పారిశ్రామిక విధానాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు.

సోమవారం న్యూయార్క్‌లోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వర్కింగ్ లంచ్ అనంతరం ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలతో రౌండ్‌టేబుల్ సమావేశమయ్యారు. ఫార్మా, ఐటీ, టెక్నాలజీ, ఈవీ, బయోటెక్, షిప్పింగ్ రంగాల్లో పేరొందిన కంపెనీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న చైర్‌పర్సన్‌లు, సీఈవోలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా హైదరాబాద్తో పాటు తెలంగాణ రాష్ట్రాన్ని పారిశ్రామిక క్లస్టర్లుగా విభజించి, అభివృద్ధి చేసేందుకు రూపొందించిన భవిష్యత్తు ప్రణాళికలు, తెలంగాణ చరిత్రపై ముఖ్యమంత్రి ప్రజంటేషన్ ఇచ్చారు.

అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. తన మనసులోని మాటలతో పాటు తమ ప్రభుత్వం ఏం కోరుకుంటుందో.. తన రాష్ట్ర ప్రజల ఆకాంక్షలేమిటో వెల్లడిస్తానంటూ అందరినీ ఉత్సాహపరిచారు. ముఖ్యమంత్రి హెూదాలో ఇది తన మొదటి అమెరికా పర్యటన అని.. ఇక్కడి నుంచి వీలైనన్ని పెట్టుబడులు తెలంగాణకు తీసుకెళ్లాలన్నదే తన లక్ష్యమని ప్రకటించారు.

పెట్టుబడుల గమ్యస్థానంగా దేశంలోనే అందరినీ ఆకర్షిస్తున్న తెలంగాణకు ఉన్న అనుకూలతలన్నింటినీ ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వివరించారు. ఇప్పటికే సాఫ్ట్‌వేర్, లైఫ్-సైన్స్, ఫార్మా రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా నిలిచిందని, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాలలో బలమైన పునాదులు వేసుకుందని చెప్పారు. కోవిడ్ను అధిగమించేందుకు మిలియన్ల కొద్దీ వ్యాక్సిన్‌లను తయారు చేసి ప్రపంచానికి సాయం చేసిందని అన్నారు.

తెలంగాణలో అద్భుతమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయని, అద్భుతమైన ప్రతిభ సంపద సిద్ధంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు వచ్చే పెట్టుబడిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అత్యుత్తమమైన మద్దతును అందిస్తుందని ప్రకటించారు. నిజాంలు నిర్మించిన 425 సంవత్సరాల పురాతనమైన హైదరాబాద్, ఇంచుమించుగా యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాతో సమకాలీనంగా ఉండటం ఆసక్తి రేపుతోందని అన్నారు.

అభిరుచితో పాటు అద్భుతమైన దూరదృష్టితో తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తుందని, ప్రపంచ పారిశ్రామికవేత్తలందరూ ఒకసారి తెలంగాణకు రావాలని, హైదరాబాద్ నగరాన్ని సందర్శించాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. హైదరాబాద్లో ఉన్న అనుకూలతలతో పాటు అక్కడున్న అవకాశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కలిసికట్టుగా గొప్ప భవిష్యత్తును నిర్మిద్దామని పిలుపునిచ్చారు.

తెలంగాణను చైనాకు ప్రత్యామ్నాయ ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి దార్శనికతను ఐటీ శాఖ మంత్రి శ్రీధర్బాబు ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలకు వివరించారు. ప్రపంచంలోనే టాప్ టెన్ సిటీల్లో ఒకటిగా హైదరాబాద్ను అభివృద్ధి చేస్తామని,

# మెడికల్ సీట్లలో తెలంగాణ బిడ్డలకు అన్యాయం

- కేటీఆర్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

స్థానికత విషయంలో తీసుకొచ్చిన కొత్త నిబంధన వల్ల మెడికల్ సీట్లలో తెలంగాణ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే ఈ నిబంధనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానికత విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీరు అనేక అనుమానాలకు తావిస్తున్నదని పేర్కొన్నారు. జీవో-33 ప్రకారం నిర్దేశించిన స్థానికతలో ని అంశాలు ప్రభుత్వం వేలితో విద్యార్థుల కండ్లను పొడిచినట్టే ఉన్నాయని మండిపడ్డారు. 9 నుంచి 12వ తరగతి వరకు తెలంగాణలో చదివిన విద్యార్థులే స్థానికులు అవుతారని ప్రభు త్వం చెప్తున్నదని, దీంతో చాలామంది ఇతర రాష్ట్రాల విద్యార్థులు తెలంగాణలో లోకల్ అవుతారని ఆందోళన వ్యక్తంచేశారు.

హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు ఉన్నందున ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు చాలామంది ఇకడే విద్యాభ్యాసం చేస్తున్నారని, కొత్త నిబంధనల ప్రకారం వారంతా తెలంగాణలో లోకల్ అవుతారని, అదేవిధంగా ఇతర రాష్ట్రాల్లో చదివే తెలంగాణ విద్యార్థులు నాన్‌లోకల్ అయ్యే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. 2023-24 వరకు 6 నుంచి 12 తరగతి వరకు నాలుగేండ్లు గరిష్ఠంగా ఎకడ చదివితే అదే స్థానికతగా గుర్తించిన విషయాన్ని కేటీఆర్ ఉదహరించారు. దాంతో మన విద్యార్థులు ఇంటర్మీడియెట్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినా వారు లోకల్‌గానే పరిగణించబడేవారని వివరించా రు. వేలాది మంది ఇతర రాష్ట్రాల విద్యార్థులు తెలంగాణలో లోకల్ అవుతారని, మన విద్యార్థులు మెడిసిన్ సీట్లు కోల్పో యే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు.

# బంగ్లాదేశ్ పార్లమెంట్ రద్దు..

(మొదటి పేజీ తరువాయి)

జియా 1991-1996 వరకు, 2001-2006 వరకు బంగ్లాదేశ్ ప్రధానిగా పని చేశారు. ఆమె 1996 సార్వత్రిక ఎన్నికల్లో కూడా విజయం సాధించగా, హసీనా అవామీ లీగ్‌తో సహా ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ఎన్నికలను బహిష్కరించాయి. దాంతో ఖలిదా ప్రభుత్వం 12 రోజుల పాటే కొనసాగింది. ఆ తర్వాత తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఖలీదా జియా లివర్ సిర్రోసిస్, కీళ్లనొప్పులు, మధుమేహం, కిడ్నీ, ఊపిరితిత్తులు, గుండె, కళ్లకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్నారు.

మరో వైపు.. తాత్కాలిక ప్రభుత్వానికి నాయకత్వం వహించబోతున్న మహ్మద్ యూనస్ గతంలో కార్మిక చట్టాలను ఉల్లంఘించిన కేసులో దోషిగా తేలారు. యూనస్‌తో పాటు ఆయనకు చెందిన గ్రామీణ్ టెలికాం సంస్థకు చెందిన ముగ్గురు వ్యక్తులు సైతం దోషులుగా తేలిన విషయం తెలిసిందే. మైక్రో ఫైనాన్సింగ్ గ్రామీణ బ్యాంకు ద్వారా లక్షలాది మందిని పేదరికం నుంచి బయటపడేశారన్న ఘనత యూనస్‌కు ఉన్నది. కానీ, దానికి విరుద్ధంగా షేక్ హసీనా నుంచి ఆయన విమర్శలను ఎదుర్కొన్నారు. పేదల రక్తాన్ని వడ్డీల రూపంలో పీలుస్తున్నారంటూ గతంలో షేక్ హసీనా విమర్శించారు. అయితే, పెట్టుబడిదారి విధానం, సామాజిక బాధ్యత విధానాల కలయికలో యూనస్ గ్రామీణ్ బ్యాంకును నెలకొల్పారు. పేదలకు స్వయం ఉపాధి కల్పించడంలో భాగంగా కొద్ది మొత్తాన్ని అందించడం ఈ బ్యాంకు ఉద్దేశం.

# గోదావరి ఫేజ్-2 పనులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

నుంచి మొత్తం 30 టీఎంసీల నీటిని వినియోగించుకునే అవకాశం ఉన్నందున అదనపు నీటి కోసం గోదావరి ప్రాజెక్టు ఫేజ్-2 చేపట్టాలని నిర్ణయించారు.

కాగా, గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్-1 కింద ఇప్పటికే ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 10 టీఎంసీల నీటిని నగర ప్రజల నీటి అవసరాల కోసం వాటర్ బోర్డు మళ్లిస్తోంది. పథకం రెండో దశ ద్వారా మల్లన్న సాగర్ జలాశయం నుంచి మరో 15 టీఎంసీల నీటిని వినియోగించుకునే అవకాశం ఉంది. ఇందులో 10 టీఎంసీలు నగర ప్రజల తాగునీటి అవసరాలకు కాగా.. మూసీ ప్రక్షాళనలో భాగంగా.. జంట జలాశయాల పునరుద్ధరణకు మిగిలిన 5 టీఎంసీలను వినియోగించనున్నారు.అంతే కాకుండా ఘన్‌పూర్, సమీర్ పేట్‌లో 780 ఎంఎల్‌డి సామర్థ్యంతో నీటి శుద్ధి ప్లాంట్‌ను నిర్మిస్తారు. ఘణపూర్ నుంచి ముత్తంగి వరకు పంపింగ్ మెయిన్ నిర్మాణంతో పాటు ఇతర పనులు చేపట్టనున్నారు. రెండేళ్లలో ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## మూడో రోజూ నష్టాలే...



బలగం టీవి, ముంబై

దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా మూడో రోజూ నష్టపోయాయి. క్రితం సెషన్‌లో 2,222 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్.. ఆసియా మార్కెట్ల సానుకూల సంకేతాలతో మంగళవారం మొస్తరు లాభాలతో ట్రేడింగ్‌ను ఆరంభించి ఒక దశలో 1,092 పాయింట్ల వరకు ఎగబాకింది. కానీ, భారీ లాభాలను ఎంతో సేపు నిలబెట్టుకోలేకపోయింది. ఆఖరి గంటలో బ్యాంకింగ్, టెలికాం రంగ షేర్ల లో అమ్మకాలు ఊపందుకోవడంతో చివరికి సూచీ 166.33 పాయింట్ల నష్టంతో 78,593.07 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 327 పాయింట్ల వరకు పుంజుకున్నప్పటికీ.. క్రమంగా తగ్గుతూ వచ్చి నష్టాల్లోకి మళ్లించి. చివరికి 63.05 పాయింట్ల నష్టంతో 23,992.55 వద్ద స్థిరపడింది. దాంతో సూచీ 24,000 కీలక స్థాయిని చేజార్చుకుంది. మధ్యాహ్నం ప్రారంభమైన యూరప్ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవడం, అమెరికా ఆర్థిక మాంద్యం భయాలు కొనసాగడం, ఆర్‌బీఐ పరపతి సమీక్షకు ముందు మదుపర్ల అప్రమత్తత ఇందుకు కారణమయ్యాయి. గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 3,274.48 పాయింట్లు (3.99 శాతం) క్షీణించింది. ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఈ మూడ్రోజుల్లో రూ.22.03 లక్షల కోట్లు తగ్గి రూ.439.60 లక్షల కోట్లకు (5.24 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 20 నష్టపోయాయి.

## బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్న కవిత

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీ మద్యం విధానం సీబీఐ కేసులో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. రౌస్ అవెన్యూ కోర్టులో దాఖలు చేసిన డీఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఉపసంహరించుకున్నారు. సీబీఐ ఛార్జిషీట్‌లో తప్పులు ఉన్నాయని పేర్కొంటూ, డీఫాల్ట్ బెయిల్‌కు అర్హురాలినని జులై 6న కవిత బెయిల్ పిటిషన్ వేశారు. ఛార్జిషీట్‌లో ఎలాంటి తప్పులు లేవని వాదనల సందర్భంగా సీబీఐ స్పష్టం చేసింది. సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు జులై 22న ప్రత్యేక కోర్టు ప్రకటించింది. ఈ మేరకు ఈ నెల 9న రౌస్ అవెన్యూ కోర్టు సీబీఐ ఛార్జిషీట్‌పై విచారణ జరపనుంది. చట్ట ప్రకారం తనకు ఉన్న ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కోర్టును ఆశ్రయించే అవకాశం ఉన్నందున, డీఫాల్ట్ బెయిల్ పిటిషన్ ఉప సంహరించుకుంటున్నట్లు కవిత తరపు న్యాయవాదులు కోర్టుకు చెప్పారు. కవిత దాఖలు చేసిన డీఫాల్ట్ బెయిల్ పిటిషన్‌పై సోమవారం వాదనలు జరగాల్సి ఉండగా, వాదనలు వినిపించాల్సిన న్యాయవాదులు అందుబాటులో లేనందున వాయిదా వేయాలని కోరారు.

కవిత తరపు న్యాయవాదులు విచారణకు హాజరుకాకపోవడంతో అసహనం వ్యక్తం చేసిన రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టు జడ్జి, పిటిషన్‌పై తుది విచారణ బుధవారం చేపట్టనున్నట్లు ప్రకటించారు. వాదనలు వినిపించలేకపోతే పిటిషన్ ఉప సంహరించుకోవాలని కవిత తరపు న్యాయవాదులకు సూచించారు. ఈ నేపథ్యంలోనే సోమవారం నాటి పరిణామాలను దృష్టిలో పెట్టుకుని మంగళవారం ఉదయం డీఫాల్ట్ బెయిల్ పిటిషన్ ఉప సంహరించుకుంటున్నట్లు కవిత న్యాయవాదులు కోర్టుకు చెప్పారు.

ఇదిలా ఉండగా కేటీఆర్, హరీశ్‌రావు నేడు కవితతో ములాఖత్ అయ్యారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు తిహాడ్ జైలులో ఉన్న కవితను కలిసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కుటుంబంతో పాటు పార్టీ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని ఆమెకు భరోసా ఇచ్చారు.



# ఐటీ ఉద్యోగుల నిరసనలు

బలగం టీవి, బెంగళూరు

ఐటి ఉద్యోగులు రోజుకు 10 గంటల నుండి 12 గంటలు పనిచేస్తున్నారు. పని గంటల పెంపును వ్యతిరేకిస్తూ ఐటి హబ్‌కి నిలయమైన కర్ణాటకలో ఉద్యోగులు నిరసనలు కొనసాగుతున్నాయి. ఆగస్టు 3వ తేదీన కర్ణాటక రాష్ట్ర ఐటి/ ఐటిస్ ఎంప్లాయిస్ యూనియన్ (కెఐటియు) నిర్వహించిన నిరసన ప్రదర్శనలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), ఐటీ సేవల రంగాలకు చెందిన వందలాది మంది కార్మికులు పాల్గొన్నారు. 10 గంటల నుంచి 14 గంటలకు పెంచుతూ ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లును ఉపసంహరించుకోవాలని వీరు డిమాండ్ చేశారు. ఈ నిరసనల్లో పనిగంటల పెంపుదలకు సంబంధించిన చట్టం కాపీని ఐటి ఉద్యోగులు తగలబెట్టారు. పనిదినాలను వ్యతిరేకిస్తూ వీరంతా నినాదాలు చేశారు. కార్మిక శాఖకు వినతి పత్రం అందించారు. ఈ నిరసనల్లో కెఐటియు అధ్యక్షులు, ఉపాధ్యక్షులు సహా ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో కెఐటియు ప్రధాన కార్యదర్శి సుహాస్ అడిగి మాట్లాడుతూ.. 'ప్రస్తుత చట్టం ప్రతిపాదిత సవరణలు ప్రభుత్వం కొనసాగించకూడదని మేము డిమాండ్ చేస్తున్నాం. ఇది కార్మికుల వ్యక్తిగత జీవితంపైనా, ప్రాథమిక హక్కుపైనా దాడి చేయడమే. ఈ చట్ట సవరణను అమలు చేయడానికి చేసే ప్రయత్నాలను యూనియన్ వ్యతిరేకిస్తుంది' అని ఆయన అన్నారు.

ఐటి ఉద్యోగుల పని గంటల పెంపునకు సంబంధించి తెచ్చిన బిల్లుకు వ్యతిరేకంగా కెఐటియు, ఇతర సంఘాలు ఉద్యమించాయి. పని గంటల పెంపు వల్ల ఐటి ఉద్యోగులు ఎదుర్కొనబోయే శారీరక, మానసిక సమస్యలపై యూనియన్ నాయకులు అవగాహన కల్పించారు. కార్మికుల శ్రేయస్సును పణంగా పెట్టి కార్పొరేషన్‌లకు ఎక్కువ లాభాలు ఆర్జించేందుకు కర్ణాటక ప్రభుత్వం యోచిస్తోంది. దీనికనుగుణంగానే పనిదినాలను 10 నుంచి 14 గంటలకు పెంచేందుకు ప్రయత్నిస్తోందని ఐటి ఉద్యోగులు పేర్కొన్నారు.

# పర్యావరణానికి హాని కలగకుండా ఎకో టూరిజం పాలసీ



- మంత్రి కొండా సురేఖ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

పర్యావరణానికి ఏమాత్రం హాని కలగకుండా, స్థానికులకు ఉపాధి కల్పించడంతో పాటు అటవీశాఖకు లబ్ధి చేకూరేలా ఎకో టూరిజం పాలసీని ఖరారు చేయాలని మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. పాలసీ రూపకల్పనలో భాగంగా పలు శాఖల ఉన్నతాధికారులతో సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి, రాబోయే తరాలకు మంచి వాతావరణాన్ని అందించే దిశగా సమర్థవంతమైన ఎకో టూరిజం పాలసీని తెస్తున్నావ న్నారు. టెంపుల్ టూరిజంకు ప్రాధాన్యతనిచ్చినట్లుగానే, ఎకో టూరిజంలో భాగంగా వాటర్ టూరిజానికి ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు.ఈ దిశగా 30 నుంచి 40 సైట్లను గుర్తించినట్లు అధికారులు మంత్రికి వివరించగా, అటవీశాఖ పరిధిలో ఉన్న పర్యావరణహిత అనుకూలత కలిగిన సైట్లను ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి అధికారులకు సూచించారు. కర్ణాటక, ఒడిశాలో అమలు చేస్తున్న ఎకో టూరిజం పాలసీలను అధికారులు మంత్రికి వివరించారు. ఈ రెండు రాష్ట్రాల్లో అమలుచేస్తున్న పాలసీలకు మధ్యస్థంగా తెలంగాణ ప్రాంత పరిస్థితులకు అనువైన పాలసీని రూపొందించాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. పీపీపీ పద్ధతిలో కార్యక్రమాలను అమలు చేయాలని సూచించారు. ఈ దిశగా ఎన్‌ఆర్‌ఐల సహకారం తీసుకోవాలన్నారు. స్థానికులకు ఉపాధిని పెంపొందించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. పర్యాటకులకు ఎకో టూరిజం స్పాట్ల సమస్త సమాచారం, ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయం కల్పిచేలా యాప్, వెబ్‌సైట్స్‌ను రూపొందించాలని అధికారులకు సూచించారు.

పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు టూరిజం స్పాట్లలో ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. తెలంగాణ ఎకో టూరిజం పాలసీ రూపకల్పను దిశగా కార్యాచరణను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మరో సమావేశం నాటికి ఎకో టూరిజం పాలసీకి స్పష్టమైన రూపాన్నివ్వాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ ఆర్‌ఎం డోబ్రియాల్, పీసీసీఎఫ్ (కంపా) సువర్ణ, నీటిపారుదల శాఖ స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, డిప్యూటీ సెక్రటరీ శ్రీలక్ష్మి, ఎకో టూరిజం ఈడి రంజిత్ నాయక్, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ప్రతినిధి ఫరీదా తంపాల్, డీసీఎఫ్ అపర్ణ, వరంగల్ డీఎఫ్ఓ అనుజ్ పాల్గొన్నారు.

# అలాంటి ఘటనలను సహించం



- ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

షాద్‌నగర్‌లో దళిత మహిళను కొట్టిన ఘటనపై ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క స్పందించారు. ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వంలో షాద్ నగర్ లాంటి ఘటనలను మా ప్రభుత్వం సహించదని అన్నారు. ఒక చోరీ కేసులో దళిత మహిళను పోలీస్ స్టేషన్ కు తీసుకొచ్చి శిక్షించిన అంశంపై సంబంధిత పోలీసు సిబ్బంది, అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నత అధికారులను ఆదేశించినట్టు వెల్లడించారు.ఘటనపై షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామిని విచారణాధికారిగా నియమించి ఒక్కరోజులోనే విచారణ జరిపించారు. మహిళను విచక్షణారహితంగా కొట్టినట్టు నివేదిక సమర్పిం చడంతో సీఐ సహా ఆరుగురు సిబ్బందిని వెను వెంటనే సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు.

బాధిత కుటుంబాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుం టుందని భట్టి విక్రమార్క అన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా వైద్య సహాయం అందజేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసు శాఖ ఉన్నతాధికారులను హెచ్చరించారు.

# 25 మంది మందుబాబులకు జరిమానా

- **తంగళ్ళపల్లి ఎస్ ఐ డి.సుధాకర్**



**బలగం టీవీ , తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలంలో గతంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన మరియు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 25 మందిని మంగళవారం రోజున సిరిసిల్ల జిల్లా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరు పరచగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఉదయశ్రీ వారందరికీ జరిమానా విధించడం జరిగిందనీ తంగళ్ళపల్లి ఎస్ ఐ డి.సుధాకర్ తెలిపారు. ఇందులో మద్యం సేవించి వాహనాలు నడిపిన 12 మందికి కి రూ.1000రూపాయలు చొప్పున 7 మందికి రూ.1500రూపాయలు చొప్పున మొత్తం 22500రూపాయలు రూపాయలు జరిమానా విధించడం జరిగింది. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 6 మందికి ఒక్కొక్కరికి రూ.210 రూపాయలు చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.తంగళ్ళపల్లి మండలంలో ఎక్కడైనా బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించినా మద్యం సేవించి వాహనాలని నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

# తెలంగాణకు నిత్య స్ఫూర్తి జయశంకర్



- **అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్**

**బలగం టీవీ , సిరిసిల్ల :**

జీవితమంతా తెలంగాణ ఉద్యమానికి, స్వరాష్ట్ర ఏర్పాటుకు అంకితం చేసిన గొప్ప వ్యక్తి ఆచార్య జయశంకర్ అని , వారి సేవలు చిరస్మరణీయమని అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్ అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ జయంతి పురస్కరించకుని వారి చిత్ర పటానికి అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ, తెలంగాణ నే ఆశ, శ్వాసగా జీవించి ఉద్యమానికి దిక్సూచిగా నిలిచారని అన్నారు . తెలంగాణ తొలి దశ ఉద్యమంలో పోరాడి మలి దశ ఉద్యమంలో స్వరాష్ట్ర సాధనకు ఆచార్య జయశంకర్ మార్గదర్శనం గా నిలిచారన్నారు. ఆచార్య జయశంకర్ మన మధ్య లేనప్పటికీ.. అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని వెల్లడించారు. ఆచార్యుని ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి రామ్ రెడ్డి, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, అధికారులు , తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్

- **రాజన్న ఆలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు..**
- **ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**బలగం టీవి, వేములవాడ :**

ప్రత్యేక రాష్ట్రం కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా వేములవాడ పట్టణంలోని రాజన్న ఆలయ చైర్మెన్ గెస్ట్ హౌస్ ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్ పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ ఒక విద్యావేత్తగా అనేకమంది జీవితంలో వెలుగులు నింపి, తెలంగాణ రావాలని తపనపడిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని అన్నారు.తెలంగాణ భావజాల వ్యాప్తికి నిరంతరం కృషి చేశారని,జయశంకర్ ఆశయాల సాధానకు చిత్తశుద్ధితో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఆయన చేసిన సూచనలు, సలహాలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకాలుగా నిలుస్తాయని అన్నారు.ఈ కార్యక్రమం లో ఆలయ ఈఓ కె.వినోద్ రెడ్డి, ఈ ఈ రాజేష్,డీఈ రఘునందన్, ఏ ఈ నాగరాజు, గోలి శ్రీనివాస్, ఈఓ సిసి ఎడ్ల శివ, వంశీ మోహన్ లు పాల్గొన్నారు.

# అర్హులైన వారికి త్వరలో 'డబుల్' ఇండ్ల పంపిణీ...

- **అర్హులైన దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి చర్యలు**
- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝ..**



**బలగం టీవీ , సిరిసిల్ల :**

జిల్లాలోని అర్హులైన దివ్యాంగులకు ఉపకరణాలు సహాయ పరికరాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట రైతు వేదికలో ఏర్పాటు చేసిన దివ్యాంగుల గుర్తింపు క్యాంపును మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఆచార్య జయశంకర్ జయంతి పురస్కరించుకొని రైతు వేదికలో ఆచార్య జయ శంకర్ చిత్రపటానికి వేసి నివాళులర్పించారు.



## మధ్యాహ్న భోజనం ఎలా ఉంది...

కేజీబీవీ విద్యాలయంను సందర్శించచన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా 6,8,10 తరగతుల విద్యార్థులకు ఇంగ్లీషు , గణితం, బౌతిక శాస్త్రాలను బోధించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి వారిచ్చిన సమాధానాల అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, పరిశీలించి, వారి నుండి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రతి సబ్జెక్ట్ ల పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనము మెనూ ప్రకారం అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. జాతీయస్థాయిలో షాట్ పుట్ పోటీలో పాల్గొన్న పదో తరగతి విద్యార్థులు అర్చిత,అంకిత లను సన్మానించారు. కేజీబీవీ భవనం పై అంతస్తు లో అసంపూర్తిగా ఉన్నటువంటి డార్మటరీ నీ పూర్తి చేయుటకు ఆదేశాలు జారీ చేశారు.


ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ జిల్లాలోని అర్హులైన దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు, సహాయ పరికరాల గుర్తింపు కోసం ఆగస్టు 5 నుంచి ఆగస్టు 10 వరకు ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల 30 నిమిషాల వరకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామని అన్నారు. శారీరక దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిల్ చేతి కర్రలు, చంక కర్రలు, వీల్ చైర్లు ,మూడు చక్రాల సైకిల్, చెవిటి, మూగ దివ్యాంగులకు వినికిడి యంత్రాలు, దృష్టిలోపం కల వారికి స్మార్ట్ కేన్ అందుల చేతి కర్ర అంద విద్యార్థులకు స్మార్ట్ ఫోన్, మానసిక దివ్యాంగులకు యంఎస్ఐఇడి కిట్ లేదా యంఆర్కిట్ పంపిణీకి చర్యలు తీసుకుంటామని అన్నారు.

దివ్యాంగులు తమ వెంట సదరం వైద్య ధృవీకరణ పత్రం లేదా 40% వికలాంగత్వం మించినట్లు ఫిజీషియన్ ఇచ్చిన ధ్రువీకరణ పత్రం, యూడిఐడి. కార్డు ధ్రువీకరణ పత్రం ఆహార భద్రత కార్డు ఆధార్ ధ్రువీకరణ పత్రం ఆధార్ కార్డు మొబైల్ నెంబర్ తీసుకొని రావాలని, బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిల్ పొందడానికి 80% వికలాంగత్వం, మిగిలిన ఉపకరణాలు పొందడానికి 40% వికలాంగత్వం ఉంటే సరిపోతుందని అన్నారు .

మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ 3 సంవత్సరాల తర్వాత జిల్లా కలెక్టర్ చోరువతో దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు సహాయ పరికరాలు అందించేందుకు దివ్యాంగుల నమోదు కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు.దివ్యాంగుల గుర్తింపు కోసం ఏర్పాటుచేసిన క్యాం పులను వినియో గించుకొని దివ్యాం గులు వారికి అవసరమైన ఉపకరణాలు సహాయ పరికరాలు పొందాలని అన్నారు.

**మొక్కలు నాటిన ఎమ్మెల్యే, కలెక్టర్..**

వన మహోత్సవ కార్యక్రమం కింద రైతు వేదిక ఆవరణలో మొక్కలు నాటారు.మండల కేంద్రంలోని రెండు పడకల గదుల ఇండ్లను పరిశీలించి,రెండు పడక గదుల ఇండ్లకు ఉన్నటువంటి రహదారి సమస్యను త్వరలో పరిష్కరించి మరియు పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు ఇండ్లను కేటాయిస్తామని ఎమ్మెల్యే తెలిపినారు.




# స్వరాష్ట్ర స్వాప్నికుడు, సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్..

- **బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య**
- **ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళ్లు**

**బలగం టీవీ , సిరిసిల్ల**

స్వరాష్ట్ర స్వాప్నికుడు, సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అని, వారి ఆశయాలతోనే ముందుకు సాగుదాం అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మంగళవారం ప్రొఫెసర్ జయంతి వేడుకలను సిరిసిల్ల పట్టణంలోని తెలంగాణ భవన్ లో టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని ధారబోసిన తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ అని, పుట్టుక నీది చావు నీది బతుకంతా తెలంగాణది అని ఎలువెత్తి చాటి వేలాది మంది ఉద్యమకారులను చైతన్యపరిచి తెలంగాణ ఉద్యమంలో పాల్గొనేలా చేశారని అన్నారు.తెలంగాణ తొలి , మలి దశ ఉద్యమంలో వారి పాత్ర కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గూడూరు ప్రవీణ్ , సెస్ చైర్మన్ చిక్కాల రామారావు , సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి , మాజీ జడ్పీ చైర్మన్ నలకొండ అరుణ రాఘవరెడ్డి , బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# చందుర్తి ప్యాక్స్ కార్యదర్శి సస్పెండ్..

**బలగం టీవీ, చందుర్తి:**

చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి గంగారెడ్డి నీ సస్పెండ్ చేసినట్లు జిల్లా సహకార అధికారి బుద్ధ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి బుద్ధ నాయుడు మాట్లాడుతూ చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో బినామి రైతుల పేరిట వెలుగులోకి వచ్చిన అవకతవకలపై అసిస్టెంట్ రిజిస్టర్ అరుణ్ జ్యోతి విచారణ చేపట్టగా సంఘ కార్యదర్శి గంగారెడ్డి రైతుల వద్ద నుండి 32 లక్షల రూపాయలు వసూలు చేసి,సంఘంనకు జమ చేయకుండా ఆక్రమణ కు పాల్పడినారని నిర్ధారణ కావడంతో, గంగిరెడ్డి ని సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు.

# క్లోరినేషన్ చేసిన తర్వాతే ప్రజలకు నీటిని సరఫరా చేయాలి..



- **అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**

**బలగం టీవీ ,వేములవాడ,**

క్లోరినేషన్ చేసిన తర్వాతే ప్రజలకు నీటిని సరఫరా చేయాలని, శివారు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రెండో రోజు మంగళవారం కోనరావుపేట మండలం కనగర్తి, నిజామా బాద్ గ్రామాలు వేములవాడ మండలం జయవరంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పర్యటించి,నీటిని వనరులను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం నిర్ణీత సమయంలో తాగునీటి వనరులు పరిశుభ్రం చేయాలని ఎక్కడా ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. 300 చదరపు గజాల స్థలం లో ఇల్లు కట్టుకున్న యజమానులు వర్షం నీటిని ఇంకుడు గుంతలోకి వెళ్ళే ఏర్పాట్లు చేసుకునేలా అవగాహన కల్పించాలని, చెరువులు, కుంటల సంరక్షణ పై ప్రజలకు వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమం లో వేములవాడ ఆర్డీవో, కోనరావుపేట మండల ప్రత్యేక అధికారి రాజేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి, వేములవాడ మండల ప్రత్యేక అధికారి లక్ష్మీరాజం, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అసత్యపు ప్రచారాలతో కాలం గడుపుతున్న కాంగ్రెస్ శ్రేణులు



- **బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి... కాంగ్రెస్ నాయకుల కండ్లకు కనబడటం లేదా..**
- **బీఆర్ఎస్ నాయకులు**

**బలగం టీవీ , వేములవాడ :**

వేములవాడ నియోజకవర్గ ప్రజలను మభ్యపెట్టి వారానికి, 15 రోజులకు ఒకసారి అభివృద్ధి పేరిట అసత్యపు ప్రచారాలు చేస్తూ కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకుంటున్నారని బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కౌన్సిలర్ నిమ్మ శెట్టి విజయ్,సిరిగిరి చందు, వెంగళ శ్రీకాంత్ గౌడ్, ఈర్లపల్లి రాజులు అన్నారు.మంగళవారం వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గ కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు వారానికి ఒకసారి ప్రెస్ మీట్ లు పెట్టి ప్రజలకు ఇది చేశాం,అది చేశాం,అంటూ అసత్యపు పోకడలతో కాలయాపన చేస్తున్నారని,ఇప్పటివరకు వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని పనులు చేశారో బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తొలి తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆధ్వర్యంలో వేములవాడ నియోజకవర్గానికి ఆలయాల విస్తరణ పేరిట, రోడ్డు వెడల్పుల పేరిట, వంద పడకల ఆసుపత్రి పేరిట ఎంతో అభివృద్ధి చేశారని, ఈ అభివృద్ధి కాంగ్రెస్ నాయకులకు కనబడడం లేదా అని ఎద్దేవా చేశారు. నిండు సభలో బిఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలను సీఎం రేవంత్ రెడ్డి ఇష్టం వచ్చినట్లు, ఆడవారి నమ్ముకుంటే మోసపోక తప్పదని చివరికి జుబ్లీ బస్టాండ్ లో కూర్చోవాల్సిందేనని మాట్లాడడం ఇంతవరకు సమంజసంమన్నారు. దానికి నిరసనగా వేములవాడ పట్టణంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేస్తే, దిష్టిబొమ్మలు ఎందుకు దగ్ధం చేస్తున్నారు,ఏంటో అర్థం కావట్లేదు అని, అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అనడం శోచనీయంగా ఉందన్నారు. బడ్జెట్లో 50 కోట్ల రూపాయల నిధులు వేములవాడ ఆలయానికి పెట్టామని ప్రెస్ మీట్ లో చెప్పి తర్వాత రోజు రాజన్నకు కోడెముక్కులని, మరుసటి రోజు పాలాభిషేకాలని రోజులు గడుపుతున్నారే తప్ప అభివృద్ధి మాత్రం శూన్యం అని అన్నారు. ఇప్పటికైనా కళ్ళు తెరిచి ఏం జరుగుతుందో కాంగ్రెస్ నాయకులు చూడాలని, లేకుంటే రాబోయే రోజుల్లో ప్రజలే వారికి గుణపాఠం చెప్పే రోజులు వస్తాయనిఅన్నారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, కౌన్సిలర్ కుమ్మరి శ్రీనివాస్, సీనియర్ నాయకులు వాసాల శ్రీనివాస్, అంజద్ పాషా, దుర్మట్ల వెంకటరెడ్డి, మైలారం రాము, కమలాకర్ రెడ్డి, రవిచంద్ర గౌడ్, ప్రేమ్ చారి, బత్తుల మహేందర్ యాదవ్, రాంబాబు, పోతు అనిల్ కుమార్, మంత సందీప్, ప్రమోద్, తుమ్మల దిలీప్, సంతోష్, లింగం రాకేష్, దమ్మ భాస్కర్, రఫీ, ఉమర్, యూసఫ్, అప్సర్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి



**బలగం టీవీ, సిరిసిల్ల**

ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను సిరిసిల్ల పట్టణంలోని పురపాలక సంఘంలో ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సందర్భంగా చైర్పర్సన్ జిందం కళా చక్రపాణి మాట్లాడుతూ ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలిదశ ఉద్యమం నుండి మలిదశ ఉద్యమం వరకు అనేక కార్యక్రమాల ద్వారా తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకున్నారు అని అన్నారు. అన్ని వర్గాలను,మేధావులను కలుపుకొని ఒక తాటిపైకి తీసుకువచ్చి తెలంగాణ ఉద్యమంలో అందర్నీ భాగస్వాములు చేయడంలో కీలక పాత్ర వహించారు అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధననే తన జీవిత లక్ష్యమని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడే వరకు తాను జీవించే ఉంటానని ప్రొఫెసర్ జయశంకర్ అనేవారని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపరిచారని అన్నారు. ఈ కార్యక్రమం లో పురపాలక సంఘం కమిషనర్ మీర్జా ఫసహత్ బేగ్ ఆలీ , వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్ , కౌన్సిలర్ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పురపాలక సంఘ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మిడిల్ ఆర్డర్ పుంజుకునేనా..?




- నేడే ఆఖరి వన్డే
- ఓడితే సిరీస్ పోయినట్టే
- గెలిస్తే సిరీస్ సమం

**బలగం టీవీ, కొలంబో**

భారత జట్టుకు శ్రీలంక గడ్డపై కఠిన సవాల్ ఎదురవుతోంది. టీ20 సిరీస్‌ను 3-0తో గెలుపొందిన టీమిండియా వన్డే సిరీస్‌లో లంక స్పిన్నర్ల ధాటికి తేలిపోతోంది. గెలవాల్సిన తొలి వన్డేను టైగా ముగించిన భారత్.. రెండో మ్యాచ్‌లో 32 పరుగుల తేడాతో భారీ ఓటమి మూటగట్టుకుంది. కెప్టెన్ రోహిత్ శర్మ రెండు మ్యాచుల్లో అర్ధ శతకాలతో గట్టి పునాది వేసినా అనూహ్యంగా మిడిల్ ఆర్డర్ వైఫల్యంతో రెండింటా ఓడడం కోట్లాదిమంది అభిమానులను కలవరపెడుతోంది.

పక్కా స్పిన్ పిచ్‌లను రెడీ చేసిన లంక మూడో వన్డేలో విజయంపై కన్నేయగా.. సిరీస్ సమం చేయడంపై రోహిత్ సేన దృష్టి పెట్టనుంది. ఒకవేళ మూడో వన్డేలోనూ గెలిస్తే లంక 27 ఏండ్ల తర్వాత భారత్‌పై ద్వైపాక్షిక సిరీస్ కైవసం చేసుకుంటుంది.

నిరంతరం మారుతున్న భారత బ్యాటింగ్ ఆర్డర్ ప్రధాన ఆందోళనగా కనిపిస్తోంది. 2023 ప్రపంచ కప్ సమయంలో బ్యాటింగ్ ఆర్డర్ స్థిరంగా ఉంది. శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ నాలుగు, ఐదో స్థానాల్లో కీలక పాత్ర పోషించారు. గంభీర్ కొత్త స్ట్రాటజీలో బ్యాటింగ్ ఆర్డర్‌లో తరచుగా మార్పులు ఉంటాయి. బ్యాటింగ్ ఆర్డర్ మారడం ఆటగాళ్ల ప్రదర్శనలను ప్రభావితం చేస్తోంది. ఈ సమస్యకు చెక్ పెట్టాలంటే ఆటగాళ్లు మెరుగ్గా రాణించేలా ఎక్కువ కాలం పాటు స్థిరమైన బ్యాటింగ్ ఆర్డర్‌ను కొనసాగించాలి.

ఇక శ్రీలంక స్పిన్ బౌలింగ్‌కు ఎదుర్కోవడంలో భారత బ్యాటర్లు ఇబ్బంది పడుతున్నారు. శ్రీలంక యంగ్ ఆల్ రౌండర్ దునిత్ వెల్లలాగే, లెగ్ స్పిన్నర్ జెఫ్రీ వాండర్సే స్పిన్‌ని ఎదుర్కోలేక వికెట్లు సమర్పించుకుంటున్నారు. రెండో వన్డేలో వాండర్సే ఏకంగా ఆరు వికెట్లు పడగొట్టాడు. టర్నింగ్ ట్రాక్‌లలో, కొత్త స్పిన్నర్‌లను ఎదుర్కోలేక కుప్పకూలడం ప్రధాన సమస్యగా మారింది. దీన్ని అధిగమించేందుకు స్పిన్ ఆడటంలో టెక్నికల్‌గా మానసికంగా ప్లేయర్స్‌ని సిద్ధం చేయడంపై బ్యాటింగ్ కోచ్ అభిషేక్ నాయర్ ఫోకస్ చేయాలి. తాత్కాలికంగా, రిషబ్ పంత్‌ను జట్టులోకి తీసుకురావడం మంచి ఫలితాలు ఇవ్వవచ్చు.

కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో తొలి వన్డేలో లంకను 240కి కట్టడి చేసిన భారత్.. ఛేదనలో తడబడింది. రోహిత్ శర్మ 58 పరుగులతో మెరిసినా విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్‌లు స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్, ఆఖర్లో శివం దూబే

# జావెలిన్ త్రోలో ఫైనల్‌కు నీరజ్



**బలగం టీవీ, పారిస్**

పారిస్ ఒలింపిక్స్‌లో పురుషుల జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రా ఫైనల్‌కు దూసుకెళ్లాడు. మంగళవారం జరిగిన క్వాలిఫికేషనల్ రౌండ్‌లో ఈటను ఏకంగా 89.34 మీటర్లు విసిరి సత్తాచాటాడు. దీంతో నీరజ్ నేరుగా ఫైనల్‌కు అర్హత సాధించాడు. ఆగస్టు 8న నీరజ్ ఫైనల్‌లో బరిలో దిగనున్నాడు. ఈసారి కూడా నీరజ్ పసిడి సాధిస్తాడన్న అంచనాలు ఉన్నాయి.

మరోవైపు ఇదే ఈవెంట్?లో కిశోర్ జెనా క్వాలిఫికేషన్ రౌండ్‌లోనే నిష్క్రమించాడు. తొలి ప్రయత్నంలో 80.73 మీటర్లు విసిరినప్పటికీ రెండో ప్రయత్నంలో ఫౌల్, మూడో అటెంప్ట్‌లో 80.21 మీటర్లు విసిరాడు. ఫైనల్‌కు నేరుగా అర్హత సాధించాలంటే 84 మీటర్ల దూరం జావెలిన్‌ను విసరాలి. లేదా టాప్ -12లో అయినా నిలవాలి. కాగా, మహిళా రెజ్లర్ వినేశ్ ఫొగాట్ క్వార్టర్స్‌కు చేరింది. 50 కేజీల ప్రిక్వార్టర్స్‌లో 3-2తో సుసాకి (జపాన్)పై గెలుపొందింది.

ఇదిలా ఉండగా మీడియాతో నీరజ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. పారిస్ ఒలింపిక్స్ ఫైనల్ కోసం తన అత్యుత్తమ ప్రదర్శనను కాపాడుకున్నానని నీరజ్ చోప్రా తెలిపాడు. 'ఇది కేవలం క్వాలిఫికేషన్ రౌండ్. ఫైనల్‌లో పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. మంచి ప్రారంభం లభించింది. 84 మీటర్ల ఆటోమేటిక్ క్వాలిఫికేషన్ మార్క్‌తో అర్హత సాధించిన త్రోయర్లందరూ ఫైనల్‌లో నాకు పోటీగా ఉంటారు. నా బెస్ట్ ఇంకా నేనివ్వలేదు. ఫైనల్ కోసం నా అత్యుత్తమ ప్రదర్శనను సేవ్ చేస్తున్నా. నేను ఫైనల్‌కు సిద్ధంగా ఉన్నాను. నేను పారిస్‌లో ప్రాక్టీస్‌లో బాగా రాణించలేకపోయాను' కానీ క్వాలిఫికేషన్ రౌండ్ ప్రారంభమైనప్పుడు మొదటి త్రోలో అర్హత సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. నా ఫిట్‌నెస్ ఇప్పుడు మెరుగ్గా ఉంది. నేను ఎప్పుడూ మొదటి త్రో నుంచి బాగా విసరడానికి ప్రయత్నిస్తాను. కానీ ప్రతిసారీ అలా జరగదు. మొదటి త్రోలో నేను విఫలమైతే, మిగిలిన త్రోలో నా అత్యుత్తమ ప్రదర్శన చేయడానికి ప్రయత్నిస్తాను. ఈ ఏడాది ప్రారంభంలో తగిలిన గాయం బాధను అనుభవిస్తున్నా. అన్ని జాగ్రత్తలు తీసుకున్నాను' అని నీరజ్ వ్యాఖ్యానించాడు.

# సెమీస్‌లో భారత్ ఓటమి



**బలగం టీవీ, పారిస్**

పారిస్ ఒలింపిక్స్‌లో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో భారత పురుషుల హాకీ జట్టు ఓటమి పాలైంది. సెమీస్ ఫైనల్లో ప్రపంచ చాంపియన్ జర్మనీని ఢీకొన్న భారత జట్టు అనూహ్య రీతిలో పరాజయం పాలైంది. హెూరాహెూరీగా సాగిన ఈ ఉత్కంఠ పోరులో ఆఖరి వరకు పోరాడన హర్మన్‌ప్రీత్ సేన 2-3 తేడాతో ఓడిపోయింది. దీంతో ఆగస్టు 8న జరిగే కాంస్య పతక పోరులో భారత జట్టు స్పెయిన్‌తో తలపడనుంది. ఆగస్టు 8న జరగనున్న స్వర్ణ పతక పోరులో నెదర్లాండ్స్ - జర్మనీ జట్లు తలపడనున్నాయి

# చరిత్ర సృష్టించిన వినేశ్ ఫోగట్



- **ఫైనల్‌కు భారత మహిళా రెజ్లర్**

**బలగం టీవీ, పారిస్**

టీమిండియా స్టార్ రెజ్లర్ వినేష్ ఫోగట్ సెమీ ఫైనల్ లో అద్భుత ప్రదర్శనతో ఫైనల్ కు చేరుకుని తొలి భారత మహిళా రెజ్లర్ గా రికార్డు సృష్టించారు. సెమీఫైనల్లో క్యూబాకు చెందిన యుస్నేలిస్ గుజ్మాన్ను ఓడించింది.

పారిస్ ఒలింపిక్స్ 2024లో వినేష్ ఫోగట్ ప్రయాణం గమనిస్తే.. తొలుత జపాన్ స్టార్, ప్రపంచ ఛాంపియన్ రెజ్లర్ సుసాయ్ హుయ్‌ను ఓడించి సంచలనం సృష్టించింది. ఈ గెలుపుతో క్వార్టర్ ఫైనల్‌లోకి ప్రవేశించింది. ఆ తర్వాత ఉక్రెయిన్ కు చెందిన ఒస్కానా లివాచ్ ఓడించి పతకం దిశగా అడుగులు వేసింది. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో వినేష్ చివరి 5 సెకన్లలో ఫిల్మీ స్టైల్‌లో రెండు పాయింట్లు సాధించి విజయం అందుకుంది. దీంతో టోక్యో ఒలింపిక్స్ ఛాంపియన్‌ను ఓడించి 3 పాయింట్లు సాధించి చారిత్రక విజయాన్ని నమోదు చేసింది వినేష్ ఫోగట్.మహిళల 50 కేజీల ఫ్రీస్టైల్ రెజ్లింగ్‌లో మెరుపు ప్రదర్శన చేసి జపాన్‌కు చెందిన సుసాకిని 3-2తో ఓడించింది. ఈ ఓటమితో ప్రస్తుత వరల్డ్ చాంపియన్ ఓటమి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఎందుకంటే సుసాకి 2020 టోక్యో ఒలింపిక్స్‌లో బంగారు పతక విజేత. నాలుగుసార్లు ప్రపంచ ఛాంపియన్ షిప్ గెలుచుకుంది. ప్రపంచ చాంపియన్‌ను ఓడించి పతకాల ఆశలను వినేష్ ఫోగట్ పెంచుకుంది. ఈ గెలుపుతో వినేష్ ఫోగట్ దాదాపు ఒక మెడల్ ను ఖాయం చేసింది. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో వినేష్, ఒస్కానా మధ్య గట్టి పోటీ నెలకొంది. అయితే, ఉక్రెయిన్ కు చెందిన ఒస్కానా లివాచ్ 7-5తో ఓటమి పాలైంది.

ఇక సెమీస్ మ్యాచ్ లో క్యూబా రెజ్లర్ తో తలపడింది. అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. మంగళవారం జరిగిన మహిళల ఫ్రీస్టైల్ 50 కేజీల సెమీఫైనల్లో వినేశ్ ఫోగట్ 5-0తో యుస్నేలిస్ గుజ్మన్ లోపెజ్ (క్యూబా)ను ఓడించి ఒలింపిక్స్ ఫైనల్ చేరిన తొలి భారత మహిళా రెజ్లర్ గా చరిత్ర సృష్టించింది. సెమీస్ లో విజయం సాధిస్తే వినేశ్ కు రజత పతకం ఖాయమైనప్పటికీ ఫైనల్స్ లో గెలిచి గోల్డ్ మెడల్ కొట్టాలని చూస్తోంది. వినేశ్ ఫోగట్ గోల్డ్ మెడల్ మ్యాచ్ బుధవారం జరగనుంది.





# 'తెలుసు కదా' షూటింగ్ షురూ

**బలగం టీవీ, హైదరాబాద్**

స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ టిల్లు స్క్వేర్ సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ సక్సెస్ తర్వాత తన నెక్స్ ప్రాజెక్ట్ 'తెలుసు కదా'తో అలరించబోతున్నారు. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ మూవీతో డైరెక్టర్ గా డెబ్యు చేస్తున్నారు. నీరజ కోన సిద్దు స్టార్‌డమ్‌ను దృష్టిలో ఉంచుకుని పర్ఫెక్ట్ స్క్రిప్ట్‌ను రెడీ చేశారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న 'తెలుసు కదా' రెగ్యులర్ షూటింగ్ మంగళవారం ప్రారంభమైంది. ఇది 30 రోజుల పాటు సాగే కీలకమైన షెడ్యూల్. ఇందులో టాకీ సీన్స్, మ్యూజిక్ నెంబర్స్ షుట్ చేస్తున్నారు. రాశీ ఖన్నా మొదటి రోజు షూటింగ్‌లో సిద్దూతో కలిసి చేరింది. ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి మరో హీరోయిన్‌గా నటిస్తుండగా, వైవా హర్ష ఒక ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నారు. నిర్మాత టిజి విశ్వప్రసాద్ ఈ సినిమాని హై బడ్జెట్ తో నిర్మిస్తున్నారు.

# మరో సినిమా మొదలుపెట్టిన విశ్వక్

**బలగం టీవీ, హైదరాబాద్**



విష్వక్ సేన్ వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమయ్యారు. రెండు చిత్రాలు సెట్స్‌పై ఉండగా.. తాజాగా మరో ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. విష్వక్‌సేన్ 13 వర్కింగ్ టైటిల్‌తో ఓ పోస్టర్ విడుదల చేశారు. యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రానికి శ్రీధర్ గంట దర్శకత్వంలో తెరకెక్కనుంది. 'కాంతార' మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ దీనికి స్వరాలు అందించనున్నారు. పోస్టర్ చూస్తే ఇందులో విష్వక్ పోలీస్‌గా కనిపించనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను వెలడించనున్నారు.

ప్రస్తుతం విష్వక్ రెండు సినిమాలతో బిజీగా ఉన్నారు. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో 'మెకానిక్ రాకీ'లో నటిస్తున్నారు. రాకీగా ఆయన మాస్ లుక్‌లో కనిపించనున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయిక. కామెడీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఇది రానుంది.దీనితో పాటు ఇటీవల 'లైలా' అనే కొత్త సినిమాను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో ఆయన అమ్మాయిగా కనిపించనున్నారు. రామ్‌నారాయణ్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రమిది. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఈ సినిమాను వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది.